ఈతకోట సుబ్బారావు

# క్షుద్ర సమస్య



**రఘు మంచి రచయిత.**

దాదాపుగా పది సంవత్సరాల కృషి. అంటే ఉత్తరాల రచయితనుండి ఎదిగిన వాడు. గత నాలుగు సంవత్సరాలలో రఘు కథలేని వార, మాస పత్రిక లేదు.

కానీ, ఆర్నెల్లు నుంచి రఘు రచన ఒక్కటీ ఏ పత్రికలోనూ కనిపించటం లేదు. ఒనపత్రికలోనడుస్తున్న సస్పెన్స్ సీరియల్ కూడా అర్ధాంతరంగా ఆగిపో యింది. రఘును ఏదో తీవ్ర సమస్య వెంటాడుతుందనిపించింది. మనిషి చిక్కి శల్యమయి ఉన్నాడు ఎన్ని ప్రశ్నలడిగినా రఘు పెదవి విప్పలేదు. చివరకు "నా జబ్బు ఎవరికి ఎలా చెప్పు కోవాలో తెలియకుంది. ఎంతమంది డాక్టర్లకు చూపెట్టి, ఎన్ని వందలు ఖర్చుపెట్టినా నయం కావటం లేదు." రఘు చెబుతూనే ఒక్క క్షణం ఆగి "నాకు ఎవరో చేతబడి చేశారా. వ్రాసేటప్పుడు మాత్రమే ఏదో కాంతి కళ్ళకు అడ్డుపడుతుంది. ఈ కాంతి కూడ కేవలం కళ్ళకే. అదీ వ్రాసే టప్పుడే. అందుకే ఇటీవల ఏమీ రాయ లేకపోతున్నాను. అంతెందుకు-నాన్నకు ఈ రెండు ముక్కల ఉత్తరం పదినిము షాల నుండి వ్రాస్తున్నాను" బాధలోనే చెబుతున్నాడు రఘు. వాడి కళ్ళలో నీళ్ళు తిరగటం నేను గమనించాను.

చెప్పేవరకూ ప్రాణాలు తీశాను. చెప్పే సరికి ఏం చెయ్యాలో, ఎలా ఓదార్చాలో నాకేమీ అర్థం కాలేదు తలొంచుకొని వాడి పెన్‌తో గీతలు గీస్తూ కూర్చు న్నాను.

రఘు ఏదో చెబుతూనే ఉన్నాడు. చేత బడులు లాటివి నేను నమ్మని మాట నిజమే అయినా-రఘుకు ఏ విధంగా ధైర్యం చెప్పాలి అదే ఆలోచిస్తున్నాను.

ఉన్నట్టుండి-...

పెద్ద బాంబు పేలింది-నా మెదడులో.

"రఘూ! నీకు ఎప్పటినుంచి ఈ జబ్బు. అదే...చేతబడి"

"ఆరు నెలనుంచి"

"ఈ స్టీలు పెన్ కొని ఎంతకాలమయింది"

"అ...ఇంచుమించు ఆరునెలలయుంటను కుంటా" ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా అన్నాడు.

నాకు నవ్వు ఆగలేదు.

"రేయ్! రఘూ! చూశావా. ఈ స్టీలు పెన్‌మీద లైటింగ్ పడుతుంది గదా! అది రిఫ్లెక్ట్ అయి కళ్ళమీద పడుతుంది. చూడు....చూడు"

రఘు తలవంచుకొనే ఉన్నా, వాడి ముఖంలోని భావాలు నేను చదవగలిగాను●